491) దేసాళం/కేదారగౌళ

ప॥ కైవల్యముకంటే కైంకర్య మెక్కుడు। శ్రీవిభుడ నీవు మాకు జిక్కేమర్మ మిదివో॥

చ॥ చేపట్టి నీశిరసు పూజించేఅహమికకంటే। నీపాదాలుపూజించేనేమ మెక్కుడు।
మాపుదాకా నినుగొల్చి మందెమేళమౌకంటే। దాపగునీదాసుల శేషత్వ మెక్కుడు॥

చ॥ హరి నీప్రసాదజీవినై గర్వించుటకంటే। నరయ నీదాసులలెంకౌ టెక్కుడు।
వెరపున నీచెవిలో విన్నపాలు సేయుకంటే। ధర నీవూడిగకాండ్ల దలపించు టెక్కుడు॥

చ॥ జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్య మందుటకంటే। అట్టె నీనామఫలమందు టెక్కుడు।
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందువంకనే। తిట్టపు మాగురునుపదేశ మెక్కుడు॥